విద్యుత్ శాఖకు బకాయిల బండ

- తాడిపత్రి పరిధిలో పేరుకుపోయిన రూ.51.53 కోట్ల బకాయిలు

తాడిపత్రి రూరల్: తాడిపత్రి విద్యుత్‌శాఖ పరిధిలో దాదాపు రూ.51,53 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. ప్రభుత్వ బడ్జెట్ వచ్చినపుడే కొంత మొత్తం బకాయిల చెల్లింపు జరుగుతోంది. ఎప్పుడు బడ్జెట్ వచ్చినా పంచాయతీలు, ప్రభుత్వ కార్యాయాల చెందిన వారు కొంత మొత్తం మాత్రమే చెల్లిస్తూ మిగిలిన నిధులను మౌలిక అవసరాలకు ఉపయోగిస్తున్నారు. దీని కారణంగా నెల నెలా బకాయిల మొత్తం పెరిగిపోతోంది. బకాయిల చెల్లింపుపై పలు దఫాలుగా నోటీసులు ఇచ్చిన కేవలం ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల నుంచి మాత్రమే బిల్లులు చెల్లిస్తామని చెపుతుండటంతో అధికారులు ఏం చేయలేని పరిస్థితి నెలకొంది. అర్థిక వనరులు లేని చిన్నా చితక పంచాయతీల పరిస్థితి సరిగా లేదు. కేవలం ప్రభుత్వ బడ్జెట్ విడుదలపై అధారపడుతున్నాయి. అర్థిక వనరులున్న తాడిపత్రి మునిసిపాలిటీ, గన్నెవారిపల్లి పంచాయతీ, యాడికి మేజర్ పంచాయతీలు సైతం బకాయిల చెల్లింపుపై దృష్టి పెట్టలేకపోతున్నాయి. ప్రధానంగా నీటి అవసరాలు, వీధి లైట్ల కోసం ఎక్కువగా విద్యుత్‌ను ఉపయోగిస్తుండటంతో అధికారులు సైతం కఠినంగా వ్యవహారించలేకపోతున్నారు.



ట్రాన్స్‌కో కార్యాలయం

బకాయిలు ఇలా..

తాడిపత్రి టాన్స్‌కో పరిధిలో రూ.51.53 కోట్ల బకాయిలున్నాయి. ఇందులో తాడిపత్రి మున్సిపాలిటీ తోపాటు యాడికి మేజర్ పంచాయతీ మరో 103 మైనర్ పంచాయతీలున్నాయి. తాడిపత్రి మండలంలో 26 మైనర్ పంచాయతీలు, యాడికిలో 13, పెద్దపప్పూరులో 20, యల్లనూరు 21, పుట్లూరు మండలంలో 23 పంచాయతీల్లో విద్యుత్ బకాయిలున్నాయి. తాడిపత్రి మున్సిపాలిటీ రూ.1.09 కోట్లు, యాడికి మేజర్ పంచాయతీ రూ.15.18 కోట్లు, మైనర్ పంచాయతీల్లో 26.80 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి. తాడిపత్రి పట్టణంలో పాటు ఆయా మండలాల్లోని ప్రభుత్వ కార్యాయాలు రూ.9.11కోట్ల బకాయిలున్నాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



తాడిపత్రి పరిధిలోని విద్యుత్ బకాయిల వసూళ్లపై చర్యలు తీసుకుంటున్నాం. బకాయిల పెండింగ్‌పై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రతి నెలా బకాయిలపై రివిజన్ చేస్తున్నాం. గతంలో పలుమార్లు ప్రభుత్వ కార్యాలయాలు, పంచాయతీలకు నోటీసులు పంపాం. అప్పట్లో వచ్చిన ప్రభుత్వ బడ్జెట్‌లో కొంత భాగం జమ చేశారు.

– నరసయ్య, ఈఆర్‌ఓ, తాడిపత్రి

వైభవంగా ఏడు శనివారాల వ్రతం



అలంకరణలో వేంకటేశ్వరస్వామి, ఏడు శనివారాల వ్రతంలో పాల్గొన్న మహిళలు

తాడిపత్రి అర్బన్: లోక కల్యాణార్థం ఏడు శనివారాల వ్రతం శనివారం పట్టణంలోని చింతల వెంకటరమణస్వామి ఆలయంలో వైభవంగా ప్రారంభమైంది. ఏడు వారాల పాటు ప్రతి శనివారం మహిళలు ఈ వ్రతాన్ని ఆచరించనున్నారు. ఆలయంలోని వాహన సేవ మండపంలో ప్రధాన అర్చకుడు మురళీబట్టార్ నేతృత్వంలో మహిళలు సామూహిక వ్రతమాచరించారు. ఈసందర్భంగా ఆలయంలోని ప్రధాన ఆది దేవతలైన లక్ష్మీ సమేత చింతల వెంకటరమణస్వామికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు ఆలయంలోని మూల విరాట్‌ను దర్శించుకున్నారు.

ఘనంగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి

తాడిపత్రి అర్బన్: జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను బీజేపీ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ ఆయన జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి కృష్ణమోహన్, ఉపాధ్యక్షులు భీమలింగేశ్వర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు సంజీవరెడ్డి, ఓబీసీ మోర్చా నాయకులు చెన్న రంగనాయకులు, అమరవాణి, పద్మవాతి, కిసాన్‌మోర్చా పట్టణాధ్యక్షుడు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆశయాల సాధనకు పాటుపడుతామని బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ క్రిష్ణమూర్తి, పట్టణ అధ్యక్షుడు వడ్డేరమేష్ అన్నారు. శనివారం ఇల్లూరుభవన్‌లో శ్యామ్‌ప్రసాద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు హరినాథ్, శేకన్న, విజయలక్ష్మి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

• పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

శింగనమల: మండలంలోని సలకంచెర్వు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996–97లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. శనివారం అదే పాఠశాల వేదికగా వారు కలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేద్దామని నిర్ణయించుకున్నారు. కష్టాల్లో ఉన్న తోటి స్నేహితులకు ఆర్థికసాయం చేశారు. అనంతరం అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు.


సలకంచెరువు హైస్కూల్‌లో కలిసిన 1996-97 బ్యాచ్ విద్యార్థులు

గొర్రెల పెంపకంలో జాగ్రత్తలు అవసరం

బుక్కరాయసముద్రం: గొర్రెల పెంపకంలో కాపరులు జాగ్రత్తలు తీసుకోవాలని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం వెటర్నీ శాస్త్రవేత్త డాక్టర్ మాధవి సూచించారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులకు వ్యవసాయంతో పాటు గొర్రెల పెంపకం కూడా ఎంతో లాభదాయకంగా ఉంటుందన్నారు. గొర్రెలు చిన్నగా ఉన్న గడ్డిని తింటాయి. ఆ గడ్డిపై నట్టలు (ఏలిక పాములు, జలిగలు బద్దె పురుగులు) లార్వా దశ క్రిములు ఉంటాయి. ఈ క్రిములు వర్షాకాలంలో నట్టల గ్రుడ్లు నుంచి లార్వా దశలోకి మారి గడ్డి ద్వారా గొర్రెలు, మేకలు శరీరంలోకి ప్రవేశిస్తాయి. గొర్రెల్లో నట్టలు ఉన్నట్లు అయితే విరేచనాలవుతాయి. శరీరంపై వెంట్రుకలు పెరిగి బలహీనంగా తయారవుతాయి. నట్టలు శరీరం నుంచి రక్తం పీల్చుట వలన జీవాలు రక్త హీనత కలిగి ఉంటాయి, జలిగలు ఉన్నట్లయితే దవడ కింద వాపు కలిగి ఉంటుంది. గొర్రెల్లో నట్టల నివారణకు నట్టల మందు త్రాగించుట వలన ఆరోగ్యంగా ఉంటాయి. గొర్రె పిల్లలు ఎదుగు దల బాగుంటుంది. ఈ మందు తాగించుట వల్ల జీవాల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఆమె తెలిపారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

గుత్తి రూరల్: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మాకం శ్రీకాంత్ అన్నారు. మండలంలోని వన్నేదొడ్డి గ్రామ శివారులో ఎన్టీపీసీ పవర్‌గ్రిడ్ ఎదురుగా గుత్తి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం 'అమ్మకు ఒక మొక్క' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 116 మంది ఆర్యవైశ్య దంపతులు ఒక్కో మొక్కను నాటారు. సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రధాని మోదీ పిలుపు మేరకు అమ్మకు ఒక మొక్క కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చౌదరి విజయభాస్కర్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు కలుగొట్ల కిషోర్, మంజునాథ్, కాసుల ఆశోక్, లక్ష్మినారాయణ, హరి, మాకం రంగనాథ్, వారణాసి రజని, వేణుగోపాల్, సుదర్శన్, ఆర్యవైశ్య మహిళ, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న
ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మాకం శ్రీకాంత్

దేవాలయాల్లో ప్రత్యేక పూజలు


లక్ష్మీ నరసింహస్వామి


అలంకరణలో భూదేవి, శ్రీదేవి సమేత రంగనాథస్వామి

తాడిపత్రి రూరల్: మండలంలోని పలు దేవాలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రసిద్ధ అలూరు కోన రంగనాథస్వామద్ధాలయంలో భూదేవి, శ్రీదేవి సమేత రంగనాథస్వామిని ప్రత్యేకంగా అలకరించారు. భక్తులు అకు పూజలు కట్టించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామిని దర్శించుకోవడానికి పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అలాగే మండలంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రమైన ఓబులేసు కోన లక్ష్మినరసింహస్వామి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. పట్టు వస్త్రాలతో లక్ష్మినరసింహస్వామిని విశేషంగా అలంకరణ చేశారు. అదేవిధంగా బుగ్గ వద్ద వేంకటేశ్వరస్వామి, చల్లవారిపల్లెలోని లక్ష్మీనరసింహస్వామి, చుక్కలూరులోని లక్ష్మీ చెన్నకేశవస్వామి తదితర దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


పామిడిలోని ఎద్దులపల్లిరోడ్డు కాలువను
జేసీబీతో శుభ్రం చేయిస్తున్న ఈఓఆర్డీ బీవీ శశికళ


యాడికి మండలం
వెంగన్నపల్లె ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం


శింగనమల కేజీబీవీలో విద్యార్థినులకు
పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శంకర్‌నాయక్

యాడికి: వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యలు చేపడుతూ అప్రమత్తంగా ఉండాలని తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సూచించారు. మండలంలోని వెంగన్నపల్లె ఉన్నత పాఠశాలలో శనివారం మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మలేరియా, డెంగీ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మురుగు కాల్వలు, గుంతలు, పాత టైర్లు, కుండల్లో నీటి నిల్వలు ఉండకుండా చూడాలన్నారు. అలాగే రాత్రిపూట దోమ తెరలు వాడాలన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పక్కీరప్ప, ఉపాధ్యాయులు, హెల్త్ సూపర్‌వైజర్ షబ్బీర్‌బాషా, ఏఎన్‌ఎం రామాంజనమ్మ, ఆశా కార్యకర్త మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పామిడి: డెంగీ తదితర సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్ యూనిట్ అధికారి వినయ్‌కుమార్ సూచించారు. శనివారం స్థానిక కాగితాలవీధిలో ఏర్పాటు చేసిన డెంగీ వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. వారానికొకసారి డ్రైడే చేపట్టాలన్నారు. కాచి చల్లార్చిన వడగట్టిన నీటిని సేవించాలన్నారు. రాత్రిపూట దోమతెరలు వాడి దోమకాటును నివారించాలన్నారు. అనంతరం ఆయన ఏఎన్‌ఎం, ఆశాలతో కలిసి కాగితాలవీధిలో నిల్వ ఉంచిన నీటిని పారవేయించారు. డెంగ్యూ తదితర సీజనల్ వ్యాధుల నివారణ–రక్షణపై ఆయన కాలనీలో అవగాహన కల్పించారు.

పామిడి: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ సీజనల్‌వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈఓఆర్డీ బీవీ శశికళ సూచించారు. శనివారం పామిడితో పాటు గజరాంపల్లి, నెమళ్లపల్లి తదితర గ్రామాల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. అందులో భాగంగా ఆమె ఆయా గ్రామాల్లో నెలకొన్న చెత్తాచెదారాన్ని తొలగించారు. జేసీబీతో కాలువల్లో పూడిక తొలగింపజేశారు. అపరిశుభ్రత ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. తాగునీటి పైప్‌లైన్ల లీకేజీలను నివారించారు. కార్యక్రమంలో ఈఓ పీ చంద్రోఖర్, మేస్త్రీ నాగరాజు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పామిడిలోని కాగితాల వీధిలో
డెంగీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శింగనమల: విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తరిమెల పీహెచ్‌సీ వైద్యాధికారి శంకర్‌నాయక్ సూచించారు. శనివారం శింగనమలలోని కేజీబీవీలో విద్యార్థినిలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం డయేరియా, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. డాక్టర్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాఠశాల పరిసరాల్లో పరిశుభ్రంగా ఉండేవిధంగా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పాఠశాలలో తాగునీటి ట్యాంక్, వంట గదిని పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అశ్వర్థ, ఎఎన్‌ఎం శైలజా, హెల్త్ ప్రొవైడర్ దివ్యభారతి, ఆశా వర్కర్లు , కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

సమయపాలన పాటించాలి


అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో ప్రార్థన చేయిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని ఓల్డ్ సీపీఐ కాలనీలోని సుంకులమ్మ అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగేశ్వరి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె అంగన్‌వాడీ కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించారు. పిల్లల చేత ప్రార్థన చేయించారు. పౌష్టికాహార పంపిణీపై ఆరా తీశారు. సమయపాలన పాటించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలను ఆదేశించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆవాజ్ నూతన కార్యవర్గం ఎన్నిక

గుంతకల్లుటౌన్: సీపీఎం అనుబంధ ముస్లిం మైనార్టీ సంఘం ఆవాజ్ పట్టణ నూతన కార్యవర్గాన్ని శనివారం ఆ పార్టీ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆవాజ్ కమిటీ పట్టణ అధ్యక్షుడిగా షాషావలి, కార్యదర్శి అబ్దుల్లా, ఉపాధ్యక్షుడిగా మస్తాన్, సహాయ కార్యదర్శిగా జాకీర్‌హుసేన్, కోశాధికారిగా ఖాదర్‌తో పాటు మరో 12 మంది సభ్యులు ఎన్నికయ్యారు.

కాలేజీల్లో 'మధ్యాహ్న భోజనం' ప్రారంభించాలి


ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

గుంతకల్లుటౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పునఃప్రారంభించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరి పరమేష్ డిమాండ్ చేశారు. పేద విద్యార్థుల ఆకలి బాధలను పట్టించుకోని ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ శనివారం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు స్థానిక ప్రభుత్వ కాలేజీ ఎదుట ధర్నా నిర్వహించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించని కారణంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వస్తున్న విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారన్నారు. అలాగే విద్యార్థులకు సకాలంలో పాఠ్య పుస్తకాలను పంపిణీ చేయడంలోనూ ప్రభుత్వ అలసత్వ ధోరణిని అవలంభిస్తోందన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రిన్సిపాల్ సాలాబాయికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి వెంకటేష్, నాయకులు కిశోర్, సమీర్, జయరామ్, చందూ తదితరులు పాల్గొన్నారు.

నేడు గురుపూజోత్సవం

తాడిపత్రి అర్బన్: స్థానిక ఆర్వీ స్వామి కల్యాణ మండపంలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 7 గంటలకు గురుపూజ మహోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం తాడిపత్రి శాఖ సభ్యులు శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.. కార్యక్రమానికి ముఖ్యతిథిగా ఆర్టీసీ డీఎం శంకర్ హాజరవుతారన్నారు. ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా హాజరుకావాలన్నారు.

కుక్కలకు రేబీస్ టీకా


కుక్కలకు టీకా వేస్తున్న దృశ్యం

తాడిపత్రి రూరల్: మండలంలో శనివారం పెంపుడు కుక్కలకు రేబీస్ టీకాను వేశామని పశువైద్యాధికారి రామక్రిష్ణ తెలిపారు. జోనోసిస్ దినోత్సవం సందర్భంగా కుక్కల ద్వారా మనుషులకు రోగాలు వ్యాపించకుండా, వాటికి టీకాలు వేశామన్నారు. పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని ఆయన సూచించారు.

సిమెంట్ లారీ బోల్తా

- డ్రైవర్‌కు గాయాలు


పొలాల్లో బోల్తా పడిన లారీ

గుత్తి: పట్టణ శివారులోని గుంతకల్లు రోడ్డులో చెరువు కట్ట వద్ద శుక్రవారం రాత్రి సిమెంట్ లారీ అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి పొలాల్లోకి బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్ బాలకృష్ణ గాయపడ్డాడు. వివరాలు.. తాడిపత్రి నుంచి బళ్లారికి సిమెంట్ లోడుతో వెళుతున్న లారీ మార్గ మధ్యంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. లారీ దెబ్బతినింది. సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వైఎస్సార్ జయంతి ఘనంగా నిర్వహించాలి

తాడిపత్రి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని సోమవారం నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి శనివారం ఓ ప్రకటనలో కోరారు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన రాజన్న జయంతిని పురస్కరించుకుని నియోజకవర్గవ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వైఎస్సార్, జగనన్న అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున జయంతి కార్యక్రమంలో పాల్గొని, వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించాలని కోరారు. వైఎస్సార్‌సీపీలో ఫుల్ జోష్ నింపేలా కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

వాటర్ ట్యాంకు వితరణ


ప్రభుత్వాస్పత్రికి వాటర్ ట్యాంక్‌ను అందజేస్తున్న దాత శేఖర్

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి ఆర్‌ఎంపీ శేఖర్ శనివారం వాటర్ ట్యాంక్, పైప్‌లను వితరణ చేశారు. వైద్యులు, సిబ్బంది, రోగుల సౌకర్యార్థం వాటర్ ట్యాంక్‌ను ఇచ్చారు. సుమారు రూ. 20 వేలు విలువైన 2 వేల లీటర్ల నీటి సామర్థ్యమున్న వాటర్ ట్యాంక్‌ను ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ ఎల్లప్పకు శనివారం అందజేశారు. దాత శేఖర్‌కు ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో పాటు వైద్యులు, వైద్య సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక టిప్పర్, ట్రాక్టర్ సీజ్

యాడికి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్, ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. శనివారం తెల్లవారుజామున నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం నల్లమేకలపల్లె తమ్మినేని నరేంద్రకు చెందిన టిప్పర్, పెద్దపప్పూరు మండలం పెద్దయక్కలూరు గ్రామానికి చెందిన ట్రాక్టర్‌లో ఎటువంటి బిల్లులు లేకుండా ఇసుకను యాడికి మండలం చందన గ్రామం మీదుగా కర్నూలు జిల్లాకు తరలిస్తుండగా, వాహనాలను పట్టుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ

పుట్లూరు: మండలంలోని గరుగుచింతలపల్లిలో శనివారం రాత్రి వైఎస్సార్‌సీపీ, టీడీపీ వర్గీయుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పెద్ద నాగలింగ, రవీంద్రకు తీవ్ర గాయాలు కాగా టీడీపీ చెందిన నవీన్‌కు గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన వారిని తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గర్భిణులు, పిల్లలకు టీకాలు

గుత్తి: పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులకు టీకాలు వేశారు. సీడీపీఓ ఢిల్లీశ్వరి, సూపర్‌వైజర్ నాగేశ్వరి ఇమ్యునైజేషన్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయండి

శింగనమల: మండలంలోని ఎండీయూ ఆపరేటర్ల ప్రజలకు రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ మోహన్‌బాబు, సీఎస్‌డీటీ రాజశేఖర్ సూచించారు. మండలంలోని ఎండీయూ ఆపరేటర్లకు కేటాయించిన డీలర్ల వద్దకు వెళ్లి , రేషన్ తీసుకోని లబ్ధిదారులకు వెంటనే పంపిణీ చేయాలన్నారు. ప్రజలకు రేషన్ సక్రమంగా పంపిణీ చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జగ్జీవన్ రామ్‌కు నివాళి

పుట్లూరు: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థికసాయం


విద్యార్థినికి నగదు అందజేస్తున్న దృశ్యం

గార్లదిన్నె: మండలంలోని కల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతిలో టాప్ మార్కులు సాధించిన ఓ విద్యార్థినికి శనివారం తరిమెల విజయరెడ్డి, మాజీ ఎంపీపీ తరిమె ప్రదీప్‌రెడ్డి రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తల్లి తరిమెల రాధమ్మ జ్ఞాపకార్థం టాపర్‌గా నిలిచిన విద్యార్థికి ఆర్థికసాయం అందిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది పదో తరగతిలో విద్యార్థిని ధరణి 540 మార్కులు సాధించ డంతో.. నగదు బహుమతి అందజేశామన్నారు.